

గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కంజర్ల విజయలక్ష్మి చంద్రకాంత్ దంపతులు

కాంగ్రెస్ పార్టీలో చేరిన కంజర్ల విజయలక్ష్మి చంద్రకాంత్ దంపతులు

అమీర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ పార్టీకి చెందిన గ్రేటర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ కంజర్ల విజయలక్ష్మి చంద్రకాంత్ దంపతులు 200 మంది కార్యకర్తలతో కలిసి టీపీసీసీ అధ్యక్షులు, మహేష్ కుమార్ గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో బుధవారం గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ విజయలక్ష్మికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పుష్పం గుచ్ఛం అందజేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై ఎంతో మంది నిత్యం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఇందుకు కంజర్ల విజయలక్ష్మి చేరికే నిదర్శనం అని, పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విజయారెడ్డి, మనుక రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్ సీట్ ఇప్పిస్తామని మోసం

యూసుఫ్‌గూడ, మే 21 (ఆంధ్రజ్యోతి): మెడిసిన్ సీట్ ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన ఎమాని శ్రీనివాస్ మెడిసిన్ సీట్ కోసం ఎల్లారెడ్డిగూడ ప్రశాంతి టవర్స్‌లోని మెస్సర్స్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (విదేశీ విద్యా) సంస్థతో 2023లో మెడిసిన్ సీట్ కోసం రూ.30 లక్షలకు ఒప్పందం కుర్చుకున్నారు. మెస్సర్స్ యజమాన్యం షేక్. షాలోసెరా, షేక్ రబ్బానీలకు దఫాల వారీగా రూ.25లక్షలు చెల్లించారు. సీట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తూ తిప్పుతున్నారు. గట్టిగా నిలదీసి అడిగితే బూతులు తిడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో బాధితుడు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చర్చల కోసం పిలిచి వృద్ధుడిపై దాడి

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): చర్చల కోసం వృద్ధుడ్ని పిలిచి ఖాళీ పేపర్ల మీద సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నించి అతనిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదయింది. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. నార్సింగికి చెందిన పెండోట చిరంజీవి చారి వ్యాపారి. భాగస్వాములైన శ్రీనివాసరాజ్ అతని కుమారుడు రోహిత్ రాజ్‌తో కలిసి చిరంజీవి మార్చిలో వ్యాపారం నిమిత్తం గాణ దేశానికి వెళ్లాడు. అక్కడ శ్రీనివాసరాజ్ 45,000 డాలర్లు పోగొట్టుకున్నాడు. తిరిగి వచ్చాక ఈ విషయంలో చర్చించాలని చిరంజీవిని బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12 లో ఉన్న ఎమ్మెల్యే కాలనీకి పిలిచారు. శ్రీనివాసరాజ్, రోహిత్‌రాజ్‌తో పాటు అజామ్, శ్రీనివాస్‌రావు అక్కడ ఉన్నా రు. కొద్ది సేపు మాట్లాడిన తరువాత చిరంజీవితో ఖాళీ బాండ్ పేపర్‌లు, చెక్కులపై సంతకాలు చేయించుకునేందుకు ప్రయత్నించగా చిరంజీవి నిరాకరించడం తో అతనిపై దాడి చేయగా స్పృహ తప్పి పడిపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేర కు నలుగురిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణం ఇస్తామని సైబర్ నేరగాళ్ల మోసం

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): రుణం ఇస్తామని చెప్పి డబ్బు కట్టించుకొని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ లక్ష్మీనర్సింహనగర్‌కు చెందిన రమేష్ సినీ పరిశ్రమలో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. ఫిబ్రవరిలో ఓ వ్యక్తి ఫోన్ చేసి ధనీ యాప్ నుంచి ఫోన్ చేస్తున్నట్టు చెప్పాడు. రుణం కావాలా అని అడగగా రమేష్ మూడు లక్షలు అడిగాడు. అనంతరం అన్ని డాక్యుమెంట్లు తీసుకున్నారు. ఇటీవలే ఫోన్ చేసి రుణం మంజూరయిందని ఇన్సూరెన్స్ కింద రూ.5,600 చెల్లించాలని సూచించగా రమేష్ వెంటనే డబ్బు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అప్పటినుంచి అవతలి వ్యక్తి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. దీంతో తెలుసుకున్న బాధితుడే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏఆర్ఎస్ఐ మ్యాన్‌ప్యాక్ చోరీ

బంజారాహిల్స్, మే 21(ఆంధ్రజ్యోతి): ఏఆర్ఎస్ఐకి చెందిన మ్యాన్‌ప్యాక్ కనిపించకుండా పోయింది. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో ఏఆర్ ఎస్ఐగా పనిచేస్తున్న నాగిరెడ్డికి ఈ నెల 18న ఎంపీ ఎమ్మెల్యే కాలనీలో డ్యూటీ పడింది. రిలీవర్ వద్ద నుంచి మ్యాన్‌ప్యాక్ తీసుకొని విధులు నిర్వహిస్తున్నాడు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్టుకు వెళ్లి టిఫిన్ చేశాడు. మ్యాన్‌ప్యాక్ పక్కకు పెట్టి చేతులు కడుక్కొని చూడగా అది కనిపించలేదు. నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు ప్రాసెస్ ఫీజు అంటూ రూ.38 వేలు మోసం

బంజారాహిల్స్, మే 21(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు ప్రాసెస్ ఫీజు అంటూ సైబర్ నేరగాళ్లు రూ.38 వేల మోసానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌కు చెందిన యర్రంపల్లి సత్యం వ్యాపారి. ఈ నెల 17న పెళ్లికి వెళ్లే హడావుడిలో ఉండగా ఓ వ్యక్తి ఫోన్ చేసి ఎస్‌బీఐ క్రెడిట్ ప్రాసెసింగ్ ఫీజు కట్టాలని అందుకు రూ.1998 అవుతుందనగా సత్యం వివరాలు ఇచ్చాడు. తర్వాత నాలుగు దఫాలుగా ఆయన క్రెడిట్ కార్డు ద్వారా రూ.38 వేలు డ్రా అయ్యాయి. ఆ తర్వాత మోసపోయినట్టు గ్రహించిన బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పెట్టిన ద్విచక్ర వాహనం మాయం

బంజారాహిల్స్, మే 21(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కింగ్‌లో పెట్టిన ద్విచక్ర వాహనం మాయమయింది. పోలీసుల వివరాల ప్రకారం.. టోలిచౌకికి చెందిన సయ్యద్ రయిజుద్దీన్ వ్యాపారి. ఈ నెల 19న ఇంటికి వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్‌లో పెట్టాడు. మరుసటి రోజు లేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇజ్రాయెల్ జెండా తొలగించిన ఒకరు రిమాండ్

ఖైరతాబాద్, మే21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న సచివాలయం ఎదురుగా పలు దేశాల జెండాలను ఏర్పాటు చేశారు. ఈనెల 14న ముగ్గురు యువకులు ఇజ్రాయెల్ దేశపు జెండాను దాని పోల్‌ను తొలగించి తీసుకువెళ్లారు. ఆ సన్నివేశాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు విచారించి ఆ దేశ జెండాను తొలగించడమే కాక దానిని కాల్చివేసినట్లు గుర్తించి కారకులైన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. న్యూ మలక్‌పేటకు చెందిన అబ్దుల్ జాకెర్ (19), అబ్బాస్, ఇంతియాజ్‌లను నిందితులుగా గుర్తించి మంగళవారం అబ్దుల్ జాకెర్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. కాగా నిందితుల్లో అబ్బాస్, ఇంతియాజ్‌లు పరారీలో ఉన్నారని, వారికోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

పనిచేస్తున్న హోటల్లోనే చోరీ

అమీర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పనిచేస్తున్న హోటల్లోనే చోరీలకు పాల్పడిన నలుగురు కార్మికులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీకేగూడ సమీపంలో చింతల్‌కు చెందిన అనురాధ ఏ4 అరేబియన్ మండి అండ్ బిర్యానీ హౌజ్ పేరిట హోటల్ నిర్వహిస్తున్నారు. ఇటీవల యజమానులు తిరుపతికి వెళ్లారు. ఇదే అదనుగా పనిచేసే నలుగురు కార్మికులు ఈ నెల 15 నుంచి వరుసగా మూడు స్ప్రిట్ ఏసీలు, కొంత నగదు దొంగిలించారని హోటల్ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇందులో పనిచేసే సిరాజ్ షేక్, సోహెల్, మసాద్, అహ్మద్ చోరీలకు పాల్పడినట్లు హోటల్ యజమాని అనురాధ, భర్త అశోక్ పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులకు ప్రత్యేక స్థలాలు

- అన్వేషిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ఫిలింనగర్, బంజారాహిల్స్‌లో రెండు ప్రాంతాల గుర్తింపు
- ఆపరేషన్ రోప్‌లో భాగంగా తొలగించిన వ్యాపారులకు న్యాయం

బంజారాహిల్స్, మే 21 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ ఇబ్బందులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట లాంటి ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం కిలోమీటరు ప్రయాణించాలంటే అరగంటకుపైగా సమయం పట్టిన రోజులు లేకపోలేదు. ఈ తరుణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆపరేషన్ రోప్‌కు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ట్రాఫిక్‌కు అడ్డంకిగా ఉన్న వాటిని తొలగించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. పశ్చిమ మండలంలోని ఫుట్‌పాత్ వ్యాపారాలపై దృష్టి సారించారు. సీఎంతో పాటు వీవీఐపీలు రాకపోకలు సాగించే బంజారాహిల్స్ జూబ్లీహిల్స్‌లో ట్రాఫిక్ అడ్డంకిగా ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగించడం మొదలుపెట్టారు. కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతుండగా, మరి కొందరు జీవనోపాధి పోగొట్టుకొని రోడ్డు మీద పడే పరిస్థితులు ఉన్నట్టు గుర్తించారు. వీరు వ్యాపారం చేసుకునేందుకు ప్రత్యామ్నాయ దారులు చూపించాలని సమాలోచన చేస్తున్నారు. నిజంగా ఇబ్బంది పడుతున్న వారు వ్యాపారం చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాల్లో అవకాశం కల్పిస్తే ఎలా ఉంటుందనే దానిపై కసరత్తు మొదలు పెట్టారు.

ఒక్కొక్కరిది ఒక్కో కథ

జూబ్లీహిల్స్‌లాంటి ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలను తొలగిస్తున్న సమయంలో అనేక ఆక్రమణలు వెలుగులోకి వచ్చాయి. కొంతమంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చిన్న వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్టు తేలింది. మరికొంతమంది ఫుట్‌పాత్‌లను పార్కింగ్ ప్రాంతాల కింద మార్చుకోవడంతోపాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు వినియోగిస్తున్నట్టు తేలింది. దీంతో పోలీసులు ఆయా ప్రాంతాల్లో ఆపరేషన్ రోప్‌ను పగడ్బందీగా నిర్వహించడం మొదలు పెట్టారు. అపోలో చౌరస్తా, ఫిలింనగర్ లాంటి ప్రాంతాల్లో కొంతమంది ఏకంగా అద్దె వసూలు చేస్తున్నట్టు తేలింది. ఇదిలా ఉండగా, ఆపరేషన్ రోప్ కారణంగా ఫుట్‌పాత్ వ్యాపారుల్లో కొంతమంది మాత్రం జీవనోపాధి కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని పోలీసులు తెలుసుకున్నారు. మరింత క్షుణ్ణంగా పరిశీలించగా వ్యాపారులు ఊరి వదిలి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఓ కుటుంబంలో ఎనిమిది మంది ఉన్నారు. వారంతా ఫిలింనగర్‌లోని ఓ టీ షాప్‌నే జీవనోపాధిగా మార్చుకున్నారు. మరో కుటుంబంలో ముగ్గురు ఆడపిల్లలుఉన్నారు. రోడ్డు మీద పెట్టిన టిఫిన్ సెంటర్ ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబం గడుస్తోంది. ఇలా అనేకమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వీరందరికీ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.



దీన్‌దయాళ్‌నగర్‌లో ఖాళీ స్థలం

అందరికీ ఒకేచోట అవకాశం..

ఫిలింనగర్‌లాంటి ప్రాంతాల్లో మెజారిటీ వ్యాపారులు పొట్టకూటి కోసమే ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టినట్టు తేలింది. వీరందరూ వ్యాపారం నిర్వహించేందుకు వారాంతపు సంత మాదిరి ప్రభుత్వ స్థలాలను చూపిస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన ట్రాఫిక్ పోలీసులకు తట్టింది. ఇందు కోసం కొంత కసరత్తు మొదలుపెట్టారు. ఫిలింనగర్ బస్తీలో ఉన్న పలు ఖాళీ స్థలాలను గుర్తించారు. వాటిలో ఏదో ఒకచోట వీధి వ్యాపారులకు చోటు కల్పిస్తే వారికి జీవనోపాధి కలగడంతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలు తగ్గి ట్రాఫిక్ ఆటంకాలు తొలగుతాయని ఆలోచిస్తున్నారు. దీన్‌దయాళ్‌నగర్‌లో రెండెకరాల స్థలం గుర్తించారు. గతంలో ఇందులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు జరిగాయి. నిర్మాణాలు పోగా స్థలం మిగిలితే ఫుట్‌పాత్ వ్యాపారులకు అప్పగించాలని పోలీసు అధికారులు రెవెన్యూ శాఖను అడగనున్నారు. బంజారాహిల్స్ నెంబర్.14 నందినగర్ గ్రౌండ్‌లో అనేకమంది వ్యాపారాలు ఏర్పాటు చేసుకున్నారు. వీరి వద్ద స్థానిక నేతలు డబ్బు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు లేకపోలేదు. ఇక మీదట ఇలాంటివి ఉండకుండా ఉండేందుకు ఈ స్థలాన్ని కూడా వీధి వ్యాపారులకు అప్పగించాలని పోలీసులు లేఖ రాయనున్నారు. అమీర్‌పేట లాంటి ప్రాంతాల్లో వీధి వ్యాపారులను తొలగించడం పోలీసులకు సవాల్‌గా మారింది. వాస్తవానికి ఇక్కడ వ్యాపారం నిర్వహించే వారంతా ఎప్పటికైనా పోలీసులు తొలగిస్తే ఇబ్బందులు తప్పవనే ఉద్దేశ్యంతో సమీపంలో షెటర్లను అద్దెకు తీసుకున్నారు.

ప్రత్యామ్నాయ దారి అవసరం



ఆపరేషన్ రోప్‌లో అనేక మంది దీనగాథలు మా దృష్టికి వచ్చాయి. షాపులు తొలగిస్తుంటే కొంతమంది వ్యాపారులు సర్వం కోల్పోయినట్టు మనోవేదనకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి వారిలో ప్రభుత్వం చట్ట ప్రకారం పనిచేస్తుందని అవగాహన తీసుకువచ్చేందుకు కౌన్సెలింగ్ ఇచ్చాం. వీరికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలాలు కేటాయిస్తే వ్యాపారం చేసుకుంటారు. సాధ్యాసాధ్యాలపై కసరత్తు చేస్తున్నాం. ఓ కొలిక్కి వచ్చిన తర్వాత రెవెన్యూ శాఖకు లేఖ రాసి అనుకూల ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారులకు అవకాశం ఇచ్చేలా చూస్తాం.

● కట్టా హరిప్రసాద్, పశ్చిమ మండలం ట్రాఫిక్ ఏసీపీ



రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ. రవిశేఖర్ రెడ్డి, తదితరులు



సోమాజిగూడ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ మహేష్ కుమార్ గౌడ్, జానారెడ్డి, వి.హనుమంతరావు, దానం నాగేందర్, తదితరులు

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

పంజాగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశ సేవ కోసం జీవితాన్ని ధారపోసిన దివంగత మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ పీవీ.రవిశేఖర్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం వెంగళరావునగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ జైలర్ రంగారావు, ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, సారంగారావు, సాంబయ్య, మల్లేష్ గౌడ్, నాగరాజు, సాయి, పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఏజీ కాలనీలో..

ఎర్రగడ్డ, మే 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన మహా నాయకులు, ఐటీ రంగానికి పునాదులు వేసిన మార్గదర్శి మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహమ్మద్ మొహసిన్ ఖురేషి కొనియాడారు. ఏజీ కాలనీలోని ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర కృష్ణ కుమార్, మైనార్టీ విభాగం వాయిస్ చైర్మన్ మొహమ్మద్ సర్దార్, నాయకులు పాల్గొన్నారు.

బోరబండలో..

బోరబండ, మే 21 (ఆంధ్రజ్యోతి): రహ్మత్ నగర్ కార్పొరేటర్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి నివాళి అర్పించారు. సైట్-2 లోని బోరబండ కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ బస్తీల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రవి గౌడ్, రమేష్ నాయక్, గోపాల్ రెడ్డి



బోరబండలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి అర్పిస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా

మరోసారి బోరుబావి సీజ్



కార్మికనగర్‌లో అనుమతి లేకుండా వేసిన బోరుబావిని సీజ్ చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

బోరబండ, మే 21 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రహదారిపై వేసిన బోరుబావిని ఖైరతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది బుధవారం రెండోసారి సీజ్‌చేశారు. రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో గత ఆదివారం రోడ్డుపై 6అంగుళాల బోర్‌వెల్ వేస్తున్న విషయాన్ని స్థానికులు ఖైరతాబాద్ మండల సిబ్బందికి సమాచారం అందించారు. దీనిపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆ బోర్‌వెల్‌ను సీజ్‌చేశారు. అయినా సదరు యజమాని యాదగిరి సీజ్‌చేసిన బోరుబావికి పైపులు వేసుకొని వినియోగంలోకి తెచ్చుకున్నారు. బుధవారం ఈ విషయాన్ని 'సీజ్ చేసిన బోరుబావికి కనెక్షన్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో దీనిపై స్పందించిన ఖైరతాబాద్ మండల తహసీల్దార్ ఎం.డి.నయీముద్దీన్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి బుధవారం కార్మికనగర్‌కు వచ్చి బోరుబావిని మరోసారి సీజ్‌చేశారు. అధికారుల అనుమతి లేకుండా సీల్ తొలగిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

మీడియా పాయింట్ వద్ద ట్రాఫిక్ సీఐ జులుం

ఖైరతాబాద్, మే21 (ఆంధ్రజ్యోతి): సచివాలయం మీడియా పాయింట్ వద్ద ట్రాఫిక్ ఇనిస్పెక్టర్ దురుసు ప్రవర్తనతో మీడియా ప్రతినిధులు విస్తుపోయారు. రోజూ మాదిరిగానే తమ వాహనాలను మీడియా పాయింట్ వద్ద పార్క్ చేసి పనులు చూసుకుంటుండగా సచివాలయ ట్రాఫిక్ విధులు నిర్వహించే ఇనిస్పెక్టర్ భాస్కర్ వచ్చి వాహనాలను తీసెయ్యాలని హడావిడి చేశారు. తమకు మరో పార్కింగ్ లేదని, మొదటి నుంచి తాము ఇక్కడే వాహనాలు పార్క్ చేస్తున్నామని విలేకరులు తెలుపగా భాస్కర్ వారితో దురుసుగా ప్రవర్తిస్తూ తాను సెక్రటేరియట్ డ్యూటీ అధికారినని, తొలగించకపోతే చర్యలుంటాయని బెదిరిస్తూ నెట్టివేయడంతో జర్నలిస్టులు ప్రతిఘటించారు. ఈవిషయమై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని జర్నలిస్టులు పేర్కొన్నారు. కాగా సదరు సీఐ భాస్కర్ తన కింది స్థాయి సిబ్బందితో సైతం దురుసుగా ప్రవర్తిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థిని బురిడీ కొట్టించి రూ.28వేలు స్వాహా

అమీర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించిన సైబర్ కేటుగాళ్లు ఓ విద్యార్థిని బురిడీ కొట్టించి రూ.28,778 నగదు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లోని కామాక్షి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న బీకాం విద్యార్థి రాజం ఆకాష్ ఈనెల 19న టెలిగ్రామ్‌లో పెట్టుబడి పేరిట ఓ లింక్ వచ్చింది. లింక్ క్లిక్ చేయగానే అది వాట్సాప్‌కు డైరక్ట్ అయ్యింది. పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బు వస్తుందని వాట్సాప్ ద్వారా సైబర్ మోసగాళ్లు విద్యార్థిని నమ్మించారు. దీంతో రూ.7 వేలను ఆగంతకులు చెప్పిన ఖాతాకు పంపాడు. మరింత డబ్బు పంపితే లాభం ఎక్కువ వస్తుందని నమ్మించారు. దీంతో మొత్తం రూ.28,778లను పంపాడు. ఆ తర్వాత మరో రూ.16 వేలు పంపాలని అగంతకులు చెప్పడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. దీంతో ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు తాగడం.. ఒక వ్యసనం: డాక్టర్ నాగేశ్వర్ రావు



బీకేగూడలో పొగాకు వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ నాగేశ్వర్ రావు

అమీర్‌పేట, మే 21 (ఆంధ్రజ్యోతి): సిగరెట్, బీడీ, చుట్ట స్మోకింగ్ మొదట్లో ఒక విధమైన ఆనందం అనిపించినా, రాను రాను అదివ్యసనంగా మారి దానికి బానిసలై పోతున్నారని, గుట్కా, జరదా, పాన్ మొదలైన పొగాకు ఉత్పత్తుల వల్ల అనేక అనర్థాలు కలిగే అవకాశం ఉందని డాక్టర్ రావూస్ హెల్త్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ నాగేశ్వర్ రావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని మే 1 నుండి 31 వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న నాగేశ్వర్ రావు స్థానికులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. బుధవారం బల్కంపేటకు వచ్చిన ఆయన స్థానికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులు వాడడం వల్ల ఇందులో ఇంచుమించు 7 వేల విష పదార్థాలు ఉంటాయని ఇవి మానవ అవయవాలను నాశనం చేసి మొత్తం మీద 69 ప్రాణాంతక వ్యాధులకు కారణభూతం అవుతుందన్నారు. ఇకపోతే సిగరెట్ తాగి వదిలిన పొగను సెకండ్‌హేండ్ పొగ లేక పాసివ్ స్మోక్ అంటారని, సిగరెట్‌ను నేరుగా తాగిన పొగకంటే ఒకరు పీల్చి వదిలిన పొగలో ఎక్కువ మోతాదులో విష పదార్థాలు ఉంటాయన్నారు. పక్కనున్న వారు ఈ పొగను పీల్చడం ద్వారా పొగాకు వ్యాధుల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారని వెల్లడించారు. పొగాకు తాగడం వల్ల మనదేశంలో యేటా ఇంచుమించు 10 లక్షల మంది చనిపోతున్నారని, అంటే రోజుకు 312 మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. పొగాకు తాగే వారి జీవితకాలం 10 సంవత్సరాలు తగ్గిపోతుందన్నారు. అనంతరం శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మధ్యాహ్న మిత భోజన కేంద్రంలో నాగేశ్వర్ రావు సుమారు 400 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



కరాటేలో బెల్టులు అందుకున్న విద్యార్థులతో ఎస్ఐ, శిక్షకులు

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

ఖైరతాబాద్, మే21 (ఆంధ్రజ్యోతి): కరాటేలో శిక్షణ పొందుతూ బెల్టు పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. ఖైరతాబాద్ ఓల్డ్‌సీఐబీ క్వార్టర్స్‌లోని బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ మైదానంలో బుధవారం ఒకినవా మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షల్లో విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శనలు నిర్వహించడమే కాక స్పైరింగ్‌లో రాణించారు. 13 మందికి ఎల్లో బెల్టులు, నలుగురికి ఆరెంజ్, 10 మందికి గ్రీన్, ముగ్గురికి బ్లూ, ముగ్గురికి మెరూన్, ఇద్దరికి బ్రౌన్ బెల్టులను ప్రదానం చేశారు. హాజరైన ఖైరతాబాద్ ఎస్ఐ సందీప్‌రెడ్డి, శిక్షకులు షిహాన్ శ్రీధర్, షిహాన్ శ్రీకాంత్‌లు విద్యార్థులకు బెల్టులను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బోరబండ, మే 21 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురికి క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. రిజ్వానా సుల్తానాకు రూ.60 వేలు, శ్రీరామ్ నగర్ కు చెందిన షేక్ సల్మాన్ కు రూ.60 వేలు, వెంగల్ రావ్ డివిజన్‌కు చెందిన మల్లికా బానుకు రూ.60వేలు, మహాత్మానగర్ కు చెందిన రాములుకు రూ.2.5 లక్షలకు సంబంధించిన ఎల్ఓసీను అందజేశారు.

రైతులకు రిజర్వేషన్లు కల్పించాలి

పంజాగుట్ట, మే21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అందాల పోటీల మీద ఉన్న శ్రద్ధ రైతుల మీద లేదని, నీటిపారుదల రంగంలో దక్షిణ తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని వక్తలు ఆరోపించారు. రైతులు, రైతుల పిల్లలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశంలో మాజీ మంత్రి గుత్తా మోహన్ రెడ్డి, కృష్ణానది పరిరక్షణ జేఏసీ అధ్యక్షుడు పి. శ్రీనివాస రెడ్డి, సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు మాట్లాడారు. ప్రాజెక్టుల పేరుతో కేసీఆర్ లక్ష కోట్లు ఖర్చు చేసినా ఎకరా నీరు పారలేదని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మేలు చేస్తుందని మోహన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



ఉచిత వైద్య క్యాంపులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ ఈటల

ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీ ఈటల రాజేందర్

మారేడుపల్లి మే 21(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ కార్ఖానా న్యూ వాసవినగర్‌లో నూతనంగా ప్రారంభించిన ఉమెన్ కేర్ అండ్ పాలి క్లినిక్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, తిరుమలగిరి ఏసీపీ రమేష్‌లు బుధవారం ప్రారంభించారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా వైద్యులు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తుండటంపై ఈటల అభినందించారు. కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, బిజెపి రాష్ట్ర నాయకుడు బానుక నర్మద మల్లికార్జున్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ కుమార్ గుప్తా, పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులను నిర్వాహకులు ఘనంగా సత్కరించి జ్ఞాపకం అందజేశారు.



కూల్చివేతలో పాల్గొన్న కంటోన్మెంట్ అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

తిరుమలగిరి మే 21(ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి గాంధీనగర్‌లో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టాడని మరో వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఉత్తర్వుల మేరకు కంటోన్మెంట్ అధికారులు బుధవారం ఇంజనీర్ రాజేశ్వర్‌రావు తిరుమలగిరి పోలీసుల బందోబస్త్‌తో వెళ్లి కూల్చివేశారు. కోర్టు ఉత్తర్వుల మేరకు రహదారిని నిర్మిస్తామని అధికారులు వెల్లడించారు.



ప్రతిజ్ఞ చేస్తున్న రైల్వే ఉద్యోగులు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

చిలకలగూడ, మే 21(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, రైల్‌నిలయంలో బుధవారం యాంటీ టెర్రరిజం డే పురస్కరించుకుని రైల్వే ఉద్యోగులు, అధికారులు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తామని, ఉగ్రచర్యలు చేపట్టిన వారిపై కఠినంగా వ్యవహరించి సమాచారం సంబంధిత ఉన్నతాధికారులకు తెలియపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీని ఉగ్రవాదులు హత్య చేసిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా యాంటీ టెర్రరిజం డేగా వ్యవహరించి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ హేమ సునీత, ఉన్నతాధికారులు అభిషేకా నందరావు, ఉదయ్ కిరణ్ బోరా తదితరులు పాల్గొన్నారు.



పహాడి హనుమాన్ ఆలయంలో సీఐ శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం చేస్తున్న హనుమాన్ భక్తులు

కొండగట్టుకు హనుమాన్ స్వాముల యాత్ర

అడ్డగుట్ట, మే 21 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్‌లోని 180 ఏళ్ల చరిత్ర కలిగి ఉన్న పహాడి హనుమాన్ ఆలయంలో "హనుమాన్ మాల స్వామి" భక్తులు శివస్వామి, అరుణ్ స్వామి, సంతోష్ స్వామి, సాయి స్వామి, శేఖర్ స్వామిల ఆధ్వర్యంలో 41 రోజుల పాటు దీక్ష నిర్వహించిన అనంతరం బుధవారం తుకారాంగేట్ ఆలయం నుంచి కొండగట్టుకు పెద్దసంఖ్యలో హనుమాన్ భక్తులు తరలివెళ్లారు. ఇందులో భాగంగా ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమానికి తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించి, స్వాములకు ధన్యావాదాలు తెలిపారు. అనంతరం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పహాడి హనుమాన్ ఆలయ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కమిటీ చైర్మన్ నక్కా మధు, ఆలయ చైర్మన్ లక్ష్మణ్, ట్రస్ట్ సభ్యులు వెంకటేష్‌గౌడ్, రమేష్‌బాబు, సంతోష్, సుబ్రహ్మణ్యం స్వామి ఆలయ చైర్మన్ లక్ష్మణ్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లు పంపిణీ చేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఘనంగా లయన్స్ క్లబ్ వజ్రోత్సవాలు

సికింద్రాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ వజ్రోత్సవాలు ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్ బాలంరాయి డ్రీమ్‌ల్యాండ్స్ ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన ఉత్సవాలకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మనోజ్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తరించాలని సూచించారు. హైదరాబాద్ నార్త్ లయన్స్ క్లబ్ మానవతావాదానికి, సామాజిక అభివృద్ధిలో చేసిన కృషిని అభినందించారు. ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు, పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఆర్.సునీల్‌కుమార్, నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్జి, డి.కోటేశ్వరరావు, హెచ్.రాజిరెడ్డి, చంద్రశేఖర్ వేముల, హరిదర్శన్ సాలికేలు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నవీన్ మాజేటి, సునీల్ తాటిపల్లి, సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా పలువురికి ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు.

వ్యక్తి అదృశ్యం



ఎం.రాజు (ఫైల్)

బౌద్ధనగర్, మే 21(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జ్ఞానేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం చిలకలగూడలో నివశించే ముదుమల రాజు(47) సికింద్రాబాద్‌లో షాపుకీపర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 20వ తేదీ రాత్రి పది గంటలకు షాపు నుంచి ఇంటికి వచ్చాడు. పదిన్నర గంటలకు ఫోన్ చేసి వస్తానని చెప్పి బయటకు వెళ్లిన అతడు తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ రావటంతో రాజు కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. దీంతో తన భర్త కనిపించటం లేదని భార్య అనిత సోమవారం చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శ్రీగణేష్



కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు



రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రాగీరు ఆనంద్‌బాబు, దేవేందర్ తదితరులు

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

సికింద్రాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని సాంకేతిక రంగంలో అభివృద్ధి చేసిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కిందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆయన హయాంలో సాంకేతిక విప్లవం ప్రారంభమైందని, దాని సత్ఫలితాలు ప్రస్తుతం దేశంలోని అన్ని వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని అన్నారు. రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్‌లో దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలంరాయి జంక్షన్‌లో జరిగిన రాజీవ్ వర్ధంతి కార్యక్రమంలో కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎస్.శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలో యువత సాధికారిత కోసం వారి ఓటు హక్కును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించారని, జవహర్ నవోదయ విద్యాలయాలు స్థాపించి, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించారని శ్రీగణేష్ అన్నారు.

బోయినపల్లి మార్కెట్ యార్డులో..

బోయినపల్లి మార్కెట్ యార్డులో మార్కెట్ చైర్మన్ రాగీరు ఆనంద్ బాబు ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి రాగీరు ఆనంద్‌బాబు, వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్ తదితర సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి రాజీవ్‌గాంధీ చేసిన సేవలను వారు కొనియాడారు.

కంటోన్మెంట్ గ్రౌండ్..

బోయినపల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు బుధవారం బోయినపల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ వద్ద కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లే గ్రౌండ్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే దేశ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెట్టారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్వంత్ రెడ్డి, బంగారు సదానంద్, మారుతి గౌడ్, సాయిబాబా యాదవ్, ముఖేష్ యాదవ్, వరప్రసాద్, శశి, టెంట్ రాజు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి కోట నీలిమ నివాళులు



పద్మారావునగర్,మే,21.(ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకొని సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా.కోట నీలిమ బుధవారం ఉదయం బోయగూడ, ఐడీహెచ్ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానిగా ఆయన దేశానికి అందించిన సేవలను కొనియాడారు.



● నివాళులు

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతి సందర్భంగా జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి బుధవారం మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- తార్నాక, ఆంధ్రజ్యోతి

కంటోన్మెంట్‌లో అంధకారం

● బస్తీలు, కాలనీల్లో వెలగని వీధి దీపాలు
● అధికారుల నిర్లక్ష్యం



సికింద్రాబాద్, తిరుమలగిరి మే 21 (ఆంధ్రజ్యోతి): వీధి దీపాలు సక్రమంగా పని చేయకపోవడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని కొన్ని బస్తీలు, కాలనీల్లో అంధకారమయంగా మారుతున్నాయి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, విజ్ఞప్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ ఆదేశిస్తున్నప్పటికీ, కిందిస్థాయి అధికారులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే సిబ్బంది తూతూ మంత్రంగా పని చేస్తున్నారన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని అది పెద్ద మురికివాడగా ఉన్న రసూల్‌పురాలో వీధి దీపాలు వెలగడం లేదంటూ పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత పరిష్కరించడానికి వస్తున్న సిబ్బంది తాత్కాలికంగా పనులు చేసి సమస్య పరిష్కారమైందంటూ ఆన్‌లైన్‌లో ఫీడ్ చేస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

గత కొన్ని రోజులుగా బొల్లారంలోని డౌటన్ బజార్ టీపీటీ క్వార్టర్స్, పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగక రాత్రి అంతా అంధకారంగా మారడంలో వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా వీధి దీపాలు బాగు చేసి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు మౌఖికంగా సమాచారం అందించినా స్పందించడం లేదంటూ సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. వీధి దీపాలు ఏర్పాటు చేయకపోతే బొల్లారం లోని వార్డు కార్యాలయం వద్ద ధర్నాలకు దిగుతామని హెచ్చరించారు.

అధికారులు స్పందించాలి

చీకటి పడితే మహిళలు బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రోడ్లపై నడవాలంటే గుంతలు తెలియక సతమతమవుతున్నారు. కంటోన్మెంట్ అధికారులు తక్షణమే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

- నరేందర్, బొల్లారం

ఆక్సిజన్ పార్కు సందర్శన వేళలను పొడిగించాలి

డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): డీడీకాలనీ పక్కన గల ఓయూకు చెందిన స్థలంలో ఆక్సిజన్‌పార్కుకు వచ్చే వాకర్స్‌కు అనుకూలంగా పార్కును తెరచి ఉంచాలన్నారు. ఈ మేరకు ఓయూ వీసీ ఎం.కుమార్‌కు డీడీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆక్సిజన్ పార్కును ఉదయం 6 నుంచి 10 గంటల వరకు తెరచి ఉంచుతున్నారని 11 గంటల వరకు పొడిగించాలన్నారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు వాకర్స్‌కు అవకాశం కల్పించాలని కోరారు. తమ వినతిపై ఓయూవీసీ స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ హరిచరణ్, రఘువీరారెడ్డి, రాంరెడ్డి, రవీందర్, లక్ష్మణ్, రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

మల్కాజిగిరి, మే 21 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మల్కాజిగిరిలోని పలు హనుమాన్ దేవాలయాల్లో పూజలు నిర్వహించనున్నారు. మారుతీనగర్‌లోని హనుమాన్ దేవాలయం, వాణీనగర్‌లోని విజయవినాయక దేవాలయం ఆవరణలో ఉన్న హనుమాన్ మందిరం, ఆనంద్‌బాగ్‌లోని సంకట విమోచన హనుమాన్ ఆలయం, పాత మల్కాజ్‌గిరిలోని హనుమాన్ ఆలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారికి పంచామృత అభిషేకం, ఉత్సవ విగ్రహానికి భక్తులతో 108 లీటర్ల క్షీరాభిషేకం, వడమాల, ఆకుపూజలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

గురుకుల పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలి

మౌలాలి, మే 21(ఆంధ్రజ్యోతి) : మైనార్టీ గురుకుల పాఠశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సికింద్రాబాద్ -1 పాఠశాల ప్రిన్సిపాల్ అతీయా సుల్తానా అన్నారు. బుధవారం మౌలాలిలోని పలు కాలనీల్లో స్కూల్ ఉపాధ్యాయ బృందంతో కలిసి ఆమె క్యాంపెయిన్ నిర్వహించారు. మైనార్టీ పాఠశాలలో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను సద్వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా స్కూల్‌లో కల్పిస్తున్న సదుపాయాలు, అందుతున్న నాణ్యమైన విద్యాబోధన గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. తమ పాఠశాలలో 5వ తరగతిలో 45, 6వ తరగతిలో 36, 7వ తరగతిలో 20, 8వ తరగతిలో 24 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జూన్ నెల చివరి వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 81436-30642 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగాల పేరిట కుచ్చుటోపీ

బోయినపల్లి, మే 21(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులను ఆసరాగా చేసుకుని ఉద్యోగాల పేరిట ఓ వ్యక్తి నుంచి ముగ్గురు వ్యక్తులు మోసం చేసి లక్షల రూపాయలు వసూలు చేసిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోయినపల్లి సీఐ తిరుపతిరాజు, ఎస్ఐ శివశంకర్‌లు తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లికి చెందిన యార్లగడ్డ అనిల్ కుమార్ అనే వ్యక్తికి సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తామని బోయినపల్లిలోని సెవన్ టెంపుల్స్ వద్ద గల తీడ్ మ్యాన్ పవర్ సొల్యూషన్స్ సంస్థలకు చెందిన నిందితులు ఈశ్వర్ చౌదరి, శ్రీనివాస్, అశోక్, విజయ్ అనే వ్యక్తులు సుమారు రూ.4 లక్షల వరకు మోసం చేశారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిందితులు ఉద్యోగం ఇప్పించడానికి 4 లక్షలు ప్యాకేజీ మాట్లాడుకోగా మొదటగా బాధితుడు రూ.50 వేలు అడ్వాన్స్‌ను ఫోన్ పే ద్వారా చెల్లించాడు. తర్వాత దశలవారీగా మిగతా డబ్బులు చెల్లించాడు. కాగా బాధితుడు ఉద్యోగ విషయం ఏమైందని వారిని అడగడంతో నిందితులు మొదటగా హైటెక్ సిటీలోని టీసీఎస్ సమీపంలో గల నియోటిక్స్ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన ఆఫర్ లెటర్ బాధితుడికి పంపించారు. ఆ అడ్రస్‌కు బాధితుడు వెళ్ళగా అక్కడ ఎలాంటి కంపెనీ లేదని తెలియడంతో తాను మోసపోయానని గ్రహించి తిరిగి వారి వద్దకు వచ్చి సంస్థకు చెందిన ఈశ్వర్ చౌదరి అనే నిందితుడిని నిలదీశాడు. ఈ సంస్థ వర్క్‌ఫర్ హోం సంస్థ అని నమ్మించి మరలా అతని నుంచి మరికొంత డబ్బులు వసూలు చేసి టెలిస్టార్ట్ అనే సంస్థకు చెందిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చారు. దీంతో మళ్లీ అక్కడకు కూడా వెళ్లడంతో అక్కడ ఎలాంటి సంస్థ లేదని తెలియగా వెంటనే ఈశ్వర్ చౌదరితో పాటు శ్రీనివాస్, అశోక్, విజయ్‌ను నిలదీశాడు. వారు రేపు మాపు అంటూ అతడికి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతుండటంతో తాను మోసపోయానని గ్రహించి బోయినపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అసంఘటిత రంగ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ చెన్నయ్య

అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అసంఘటితరంగ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని అసంఘటిత రంగ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ చెన్నయ్య డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఎన్జీవో, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక రంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంఘిక భద్రత, 2020 చట్టం రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి, కార్మిక చట్టాలను వర్తింపచేయాలన్నారు. కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక కోడ్‌ను రద్దు చేయాలని, స్త్రీ, పురుషులకు సమానంగా వేతనాలు ఇవ్వాలని, కార్మిక మహిళల ప్రసూతికి రూ.50 వేల ఆర్థిక సహకారం అందించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రమాద స్థలంలో సంఘటనపై అంగవైకల్యం, మృతి చెందిన వారికి 5 లక్షల ఆర్థిక సహకారం అందించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు, సంక్షేమం పథకాలపై గ్రామీణ ప్రాంతాలలో కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేసీఎస్.ప్రసాద్, వెంకటయ్య, ప్రఫుల్ రాంరెడ్డి, ప్రసాద్, అవినాష్, ఇందిరా, ఆస్తా, అమృత, రేణుక, నారాయణస్వామి, లక్ష్మి పాల్గొన్నారు.



మహా హారతి కార్యక్రమానికి హాజరైన బీజేపీ నాయకులు

అహల్యాబాయి సేవలు చిరస్మరణీయం

పద్మారావునగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): రాజమాత అహల్యాబాయి హల్కర్ జయంతి ఉత్సవాలను కేంద్రంలోని బీజేపీ పిలుపు మేరకు ఈ నెల 31 వరకు వివిధ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు బన్సీలాల్‌పేట్ డివిజన్ బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం చాచానెహ్రూనగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేశ్, రాజమాత అహల్యాబాయి కార్యక్రమ కన్వీనర్ ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు కే.ఎం.కృష్ణ, వై.సురేష్, ఎస్.రాజు, కె.కృష్ణ, శ్రీకాంత్, లక్ష్మణ్, సెల్వరాజ్, దిలారి లక్ష్మి, అండాలు, పద్మ, పరమేశ్‌లు పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో..

రాజమాత అహల్యాబాయి హల్కర్ 300 సంవత్సరాల జయంతి ఉత్సవాలకు హాజరుకావాలని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో నిర్వహించిన మహా హారతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీరసుచిత్ర శ్రీకాంత్, మోండ మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక, అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజశేఖరరెడ్డి, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పాల్గొన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ , ఇన్‌చార్జి కోట నీలిమ సమక్షంలో పార్టీలో చేరుతున్న కంజర్ల విజయలక్ష్మి

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

బేగంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరిగాయి. మాజీమంత్రి లక్ష్మినారాయణ యాదవ్ కోడలు కంజర్ల విజయలక్ష్మి, చంద్రకాంత్ యాదవ్ దంపతులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ సమక్షంలో కంజర్ల విజయలక్ష్మి దంపతులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సనత్‌నగర్ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న త్రోబాల్ సెలెక్షన్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర సబ్ జూనియర్ బాలబాలికల త్రోబాల్ జట్లను ఎంపిక చేసేందుకు సెలెక్షన్స్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 25వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సికింద్రాబాద్‌లోని ఏవీకే స్పోర్ట్స్ అకాడమీలో ఎంపిక పోటీలను నిర్వహిస్తామని రాష్ట్ర త్రోబాల్ సంఘం కార్యదర్శి కిరణ్ చారి తెలిపారు. ట్రయల్స్‌లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర జట్లకు ఎంపిక చేయనున్నారు. వీరు జూన్ 22 నుంచి షిరిడీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం ఈ నంబర్లకు 9502471347, 9966666157 ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

నేడు తార్నాకలో హనుమాన్ జయంతి ఉత్సవాలు

తార్నాక, మే 21 (ఆంధ్రజ్యోతి) : నేడు హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు బండ శివారెడ్డి ఆధ్వర్యంలో గురువారం తార్నాకలోని గణపతి దేవాలయం ఆవరణలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు, మాజీ మేయర్ బండ కార్తీకా చంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంటలకు అభయాంజనేయ స్వామికి సహస్ర నామ ఆకుపూజ కార్యక్రమం, అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.